సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



'హైలెవెల్' దగా..! 8లో
అచ్యుతాపురం సెజ్‌లో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదం తర్వాత ప్రభుత్వం.. తూతూ మంత్రంగా హైలెవల్ కమిటీని విచారణకు వేసింది.



రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు విశాఖ విద్యార్థులు 8లో



ఇసుక ధర రెట్టింపుతో ఉపాధి దూరం 8లో

న్యూస్‌రీల్

జీవీఎంసీ సీసీపీగా ప్రభాకర్



సాక్షి, విశాఖపట్నం: మహా విశాఖ నగర పాలక సంస్థ చీఫ్ అర్బన్ ప్లానర్(సీసీపీ)గా ఏ.ప్రభాకర్‌రావుని నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభాకర్ ప్రస్తుతం ఏపీసీఆర్‌డీఏ టౌన్‌ప్లానింగ్ అడిషనల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. జీవీఎంసీలో డీసీపీగానూ, సీపీగా చేసిన ప్రభాకర్ మూడు నెలల పాటు సీసీపీగా కూడా పనిచేశారు. అనంతరం వీఎంఆర్‌డీఏ చీఫ్ అర్బన్ ప్లానర్‌గా వెళ్లి.. అక్కడి నుంచి విజయవాడకు బదిలీ అయ్యారు. తాజాగా మరోసారి జీవీఎంసీ సీసీపీగా ప్రభాకర్‌కు బాధ్యతల్ని ప్రభుత్వం కట్టబెట్టింది.

జీవీఎంసీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా జయరాం

సాక్షి, విశాఖపట్నం: మహా విశాఖ నగర పాలక సంస్థ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా ఎస్.జయరాంని నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన జోన్ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. జయరాం గతంలోనూ జీవీఎంసీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వర్తించారు.

ఏయూను సందర్శించిన మైటీ కార్యదర్శి



మైటీ కార్యదర్శి కృష్ణన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(మైటీ) కార్యదర్శి ఎస్.కృష్ణన్ శనివారం ఆంధ్రా యూనివర్సిటీని సందర్శించారు. ముందుగా ఏయూలో ఏర్పాటు చేసిన నాస్‌కామ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు వెళ్లి పరిశీలించారు. అనంతరం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో ఏయూ అధికారులతో భేటీ అయ్యారు. శతాబ్దికి చేరవవుతున్న యూనివర్సిటీ విశిష్టతను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు వివరించారు. కృష్ణన్‌కు ఏయూ తరపున జ్ఞాపికను బహూకరించి సత్కరించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



కేరళలో అతి ముఖ్యమైన పండగ ఓనం. ఇంకా చెప్పాలంటే మన సంక్రాంతి అంత సంబరం. రుతుపవనాల ముగింపును గుర్తు చేసుకుంటూ, బలిచక్రవర్తిని ఆహ్వానిస్తూ మలయాళీలు జరుపుకునే పండగ ఇది. ఓనం అనగానే పువ్వులతో అందమైన అలంకరణ, చూడముచ్చటగొలిపే ముస్తాబు, పసందైన విందు భోజనం సద్య గుర్తొస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా కేరళీయులు ఓనంను ఎంతో సంతోషంగా జరుపుకుంటారు. విభిన్న సంస్కృతుల సమ్మేళనంగా విరాజిల్లుతున్న విశాఖలో స్థిర నివాసం ఏర్పరుచుకున్న కేరళీయులు ఆధునిక జీవన విధానాన్ని అనుసరిస్తూనే తమ సంప్రదాయాలు, విలువలను నేటి తరానికి అందిస్తున్నారు. ఆదివారం ఓనం పర్వదినాన్ని వైభవంగా జరుపుకోవడానికి వారు సిద్ధమయ్యారు. స్థానిక ప్రజల ఆచార వ్యవహారాలు గౌరవిస్తూనే.. తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ.. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతున్నారు. - మురళీనగర్



మహాబళి చిహ్నం

ఓనందం

సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటున్న కేరళీయులు

నేడు కేరళ కళా సమితిలో వేడుకలు

SUNDAY SPECIAL



పూక్కళం వద్ద ఓనంకు స్వాగతం పలుకుతున్న కేరళ మహిళలు

మలయాళీల ప్రధాన పండగల్లో విషు, ఓనం ముఖ్యమైనవి. జాతి, కుల, మత బేధాలు లేకుండా ఓనం నిర్వహిస్తారు. ఎవరి ఇంటికి వెళ్లినా ఓనం పర్వదినోత్సవం నాడు సందడిగా ఉంటుంది. వీరి పూజా విధానం, విందు, వినోదాలు తెలుగు వారి సంప్రదాయాలను పోలి ఉంటాయి. ఈ పండగను 10 రోజుల పాటు జరుపుకుంటారు. మొదటి రోజు అథమ్, చివరి రోజు తిరు ఓనం ముఖ్యమైనవి. ఓనం మొదటి రోజు తెల్లవారుజామున ఆలయాల్లో పూజలు చేస్తారు. ప్రతి ఇంటి ముందు మహిళలు పూలతో ఫ్లవర్ కార్పెట్(పూక్కళం) ఏర్పాటు చేస్తారు. దీంతో ఓనం ప్రారంభమవుతుంది. తమ ఆరాధ్య దైవమైన బలి చక్రవర్తి పునరుత్థానం చెంది ఓనం రోజున తమ భూమిపై అడుగు పెడతారని వీరి నమ్మకం. ఆ రోజు బలిచక్రవర్తిని ఆహ్వానించి ఆయన ఆశీస్సులు తీసుకుంటారు. ఇందులో భాగంగా పూలతో వేదికను అలంకరించి.. దీపపు వెలుగులు ఏర్పాటు చేస్తారు. కుంచంలో ధాన్యపు రాసులు పోసి దానిపై కొబ్బరి పూలను ఉంచుతారు. దీపం వెలిగించి పూజలు చేస్తారు. పది రోజుల పాటు పూక్కళంపై పుష్పాలను పేర్చుకుంటూ వెళ్తారు. ఓనంను శ్రావణ మహోత్సవంగా కూడా పిలుస్తారు.



సంప్రదాయ దుస్తుల్లో మహిళలు(ఫైల్)

కళా కేరళం పేరిట మ్యాగజైన్

కేరళీయులు తమ జాతి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు 'కళా కేరళం' పేరిట మ్యాగజైన్ ప్రచురిస్తున్నారు. ఏడాదికి రెండు సార్లు 80 పేజీలతో ఈ మ్యాగజైన్ విడుదలవుతుంది. ఓనం రోజున ఒకటి, కేరళ కళాసమితి వార్షికోత్సవం నాడు మరో ఎడిషన్ ఆవిష్కరిస్తారు. కళా సమితి సభ్యులు రాసిన కథనాలు, కళలు, సంస్కృతి, స్ఫూర్తివంతమైన కథనాలు, ఆరోగ్య సూత్రాలు, కేరళ వంటకాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, కేరళలోని వివిధ ప్రాంతాలు, సందర్శన స్థలాలకు చెందిన కథనాలు, తాజా మార్పులు, చరిత్ర, ప్రముఖుల రచనలు, కథలు, కవితలు, అవార్డులు సాధించిన ప్రముఖుల వివరాలు ఈ మ్యాగజైన్‌లో ఉంటాయి. కేరళీయులు విశాఖ నగరంతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థుల చదువుకు సాయం, పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీ, వైద్య, రక్తదాన శిబిరాల నిర్వహణ, తుపాను బాధితులకు ఆర్థిక సాయం తదితర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



సద్యకు కూరగాయలు సిద్ధం చేస్తున్న మహిళలు

నేడు ఓనం వేడుకలు

బిర్లా కూడలి సమీపంలోని కేరళ కళా సమితిలో ఆదివారం ఓనం ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఇప్పటికే మహిళలకు ముగ్గుల పోటీలు, పాయసం, ఇతర వంటల పోటీలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలకు కేరళలోని రన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రమోద్ నారాయణ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను ఆహ్వానించారు. వేడుకల్లో భాగంగా పూక్కళం వద్ద ప్రత్యేక పూజలు, మహాబళికి స్వాగతం, కేరళకు చెందిన ఆర్కెస్ట్రా ప్రదర్శన, వివిధ రకాల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అనంతరం కేరళీయుల ప్రత్యేక వంటకాలతో కూడిన 'సద్య'ను ఆరగిస్తారు.

సిటీ ఆఫ్ డెస్టినీ విశాఖ



విశాఖ నగరంలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్నాం. ఇక్కడి ప్రజల ఆదరణ మరువలేం. సిటీ ఆఫ్ డెస్టినీగా పిలిచే విశాఖలో నివసించడం మాకు గర్వకారణం. ఇక్కడే పుట్టి పెరిగిన నేటి యువతరానికి కేరళ సాంస్కృతిక వారసత్వాన్ని అందించాల్సిన బాధ్యత మాపై ఉంది. ఎక్కడ ఉన్నా మా భాష, సంస్కృతిని కొనసాగించాలని మేము భావిస్తాం. కేరళలో నిర్వహించే ప్రతి పండగను ఇక్కడ జరుపుకుంటాం.

– కెప్టెన్ లైలాగణేశన్, ప్రధాన కార్యదర్శి, కేరళ కళాసమితి

సంప్రదాయాలు కొనసాగింపు



నాలుగు తరాలు ఇక్కడే పుట్టి పెరిగారు. విశాఖ నగరం, పరిసరాల్లో 2 వేల మంది వరకు కేరళీయులు నివసిస్తున్నారు. తెలుగు ప్రజలతో మమేకమయ్యాం. తమ పూర్వీకులు నివసించిన మాతృభూమి గురించి ఇప్పటితరానికి తెలియాల్సిన అవసరం ఉంది. కేరళలో నిర్వహించే విషు, ఓనం వంటి సంప్రదాయ పండగలను వారికి తెలియజేయడం ద్వారా భవిష్యత్ తరాలకు మా సంస్కృతిని అందించి కొనసాగించగలం. అందుకే ప్రత్యేకంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నాం.

– ఏఆర్‌జీ ఉన్నిత్తన్, అధ్యక్షుడు, కేరళ కళాసమితి

సంప్రదాయాలంటే గౌరవం



భారతీయ సంప్రదాయాలు అంటే నాకు ఎంతో గౌరవం. మా తల్లిదండ్రులు నేర్పిన కేరళ సంస్కృతీ సంప్రదాయాలను తూ.చ తప్పకుండా పాటిస్తాం. మా నాన్న మనోజ్ రిటైర్డ్ నేవీ ఉద్యోగి. అమ్మ అప్సర గృహిణి. అన్నయ్య ఆదిత్య మనోజ్ అమెరికాలో ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడే ఓనం పండగ చేస్తాడు. ఇక్కడే పుట్టి పెరిగాను. నేను తెలుగు బాగా మాట్లాడతాను. తెలుగు ప్రజలంటే ఎంతో ఇష్టం.

– అవంతిక ఎం.నాయర్, విద్యార్థి

విశాఖతో 50 ఏళ్ల అనుబంధం



విశాఖతో మా కుటుంబానికి 50 ఏళ్ల అనుబంధం ఉంది. మా తాత ప్రభాకర్ నాయర్ ఇక్కడ హోటల్ వ్యాపారం ప్రారంభించారు. మా నాన్న విజయ్ ఈ వ్యాపారం కొనసాగిస్తున్నారు. మేమందరం ఇక్కడే పుట్టి పెరిగాం. తెలుగు ప్రజలు, బంధువులతో మమేకమైపోయాం. అయినా మా మాతృభాషకు ప్రాధాన్యమిస్తాం. అమ్మ శాంతి కేరళ సాంస్కృతి సంప్రదాయాలను నేర్పించారు. బీకాం చదివిన నేను బెంగళూరులోని కేపీఎంజీ కంపెనీలో పని చేస్తున్నాను. ఓనం పండగ కోసం సెలవు పెట్టుకుని వచ్చాను. మా అక్క అంజూవిజయ్ కూడా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది.

– నందనా విజయ్

తెలుగు ప్రజల ఆదరణ గొప్పది



నేను, మా అన్నయ్య ఇక్కడే పుట్టి పెరిగాం. తెలుగు ప్రజల ఆదరణ అమోఘం. కేరళీయులమైనప్పటికీ మేము విశాఖ వాసులుగానే స్థిరపడ్డాం. ఇక్కడ నాకు మంచి స్నేహితులు ఉన్నారు. ఓనం పండగను అందరం కలిసి చేస్తాం. ఓనం కోసం నేను నెల్లూరు యూనివర్సిటీ నుంచి వచ్చాను. నా తండ్రి ఏఆర్‌జీ ఉన్నిత్తన్ మెరైన్ కేర్ కంపెనీ నడుపుతున్నారు. అమ్మ డాక్టర్ విద్య రాజగోపాలన్ ప్రిజమ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. అన్నయ్య అనంత కృష్ణన్ జర్మనీలో చదువుతున్నాడు. తెలుగువారి పండగలన్నింటికీ మేము వెళ్తాం.

– విశాల్‌కృష్ణన్, డిగ్రీ విద్యార్థి





కెరటాలతో కేర్‌ఫుల్

ఆర్.కె.బీచ్‌లో సహజంగా ఏర్పడిన అందమైన దృశ్యం సందర్శకులను ఆకర్షిస్తోంది. వాతావరణ మార్పుల కారణంగా రాళ్లు బయటపడ్డాయి. పచ్చని నాచుతో ఉన్న ఈ రాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రాళ్లపైకి ఎక్కి సెల్ఫీలు తీసుకునేందుకు పెద్ద సంఖ్యలో సందర్శకులు బీచ్‌కు తరలివస్తున్నారు. అయితే ఇక్కడే ప్రమాదం దాగి ఉంది. పెద్ద కెరటం వచ్చినా.. అకస్మాత్తుగా నీటి మట్టం పెరిగినా.. ఈ రాళ్లపై ఉన్న వారికి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ విషయాన్ని గమనించిన బీచ్‌గార్డ్స్ సందర్శకులను అప్రమత్తం చేస్తున్నారు. – ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

గ్రిల్స్ పసుపుమయం

ఎవడి అబ్బ సొమ్మని రంగులు వేయిస్తున్నారంటూ అప్పట్లో బీరాలు పలికిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత అంతా పసుపుమయం చేస్తున్నారు. భవనాలు, గోడలు, డివైడర్లు.. ఇలా ఎక్కడ అవకాశం ఉన్నా పచ్చ పైత్యాన్ని చూపిస్తున్నారు. సెవెన్‌హిల్స్ ఆస్పత్రి నుంచి గవర్నర్ బంగ్లా వరకు డివైడర్లు మధ్యలో ఉన్న గ్రిల్స్‌ను కూడా పసుపుమయం చేసేశారు. తెలుగుదేశం పార్టీ సొంత డబ్బులతో నిర్మించినట్లు అన్నా క్యాంటీన్లను అయితే పార్టీ కార్యాలయాలుగా మార్చేశారు. - ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



నేడు సబ్ రిజిస్ట్రార్లకు బదిలీల కౌన్సెలింగ్

- 64 మందిలో 48 మంది బదిలీలకు అవకాశం
- సీనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్ల బదిలీలు నేటితో పూర్తి
- మంచి స్థానాల కోసం భారీ పైరవీలు

విశాఖ సిటీ: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలకు ఈ నెల 22వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉత్తరాంధ్ర (ఉమ్మడి విశాఖ, ఉమ్మడి విజయనగరం, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాల పరిధి) జోన్‌లో మొత్తం 64 సబ్ రిజిస్ట్రార్లు ఉండగా.. తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా ఇందులో 48 మంది సబ్ రిజిస్ట్రార్లు బదిలీ కానున్నారు. మార్చి నెలలో పదవీ విరమణ చేయనున్న సబ్ రిజిస్ట్రార్లకు బదిలీల జాబితా నుంచి మినహాయించారు. ఇందులో ఆనందపురం, పాలకొండ సబ్ రిజిస్ట్రార్ వచ్చే ఏడాది మార్చిలోగా పదవీ విరమణ చేయనుండటంతో ఈ స్థానాలను మినహాయించారు. ప్రధానంగా మధురవాడ, భీమిలి, సూపర్ బజార్ ఆర్వో, ద్వారకానగర్, అనకాపల్లి, విజయనగరం, విజయనగరం వెస్ట్, శ్రీకాకుళం టౌన్‌తో పాటు కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చేందుకు పలువురు సబ్‌రిజిస్ట్రార్లు పైరవీలు చేసుకుంటున్నారు. తాజా మార్గదర్శకాలతో భోగాపురం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం కాస్తా కేటగిరీ–సీలో మారడంతో ఈ స్థానానికి వచ్చేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. అయితే అంతా కౌన్సెలింగ్ ద్వారానే జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నా.. అధికార పార్టీ నేతల ద్వారా పైరవీలతో పాటు భారీ ఎత్తున ముడుపులు సమర్పించుకునే వారికి మంచి పోస్టింగులు దక్కే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విశాఖ డీఐజీ బాలకృష్ణ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ కౌన్సెలింగ్ టీమ్‌లో విజయనగరం డీఐజీ సభ్యులుగా ఉన్నారు. ప్రధాన కార్యాలయం నుంచి జాయింట్ ఐజీ టి.సరోజ పరిశీలకులుగా వచ్చారు. సబ్ రిజిస్ట్రార్లతో పాటు సీనియర్ అసిస్టెంట్స్, ఆఫీస్ సబార్డినేట్స్ బదిలీలను ఆదివారంతో పూర్తి చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.



సైకత శిల్పాన్ని తిలకిస్తున్న విద్యార్థులు





అవగాహన కల్పిస్తున్న చిన్నారులు.. చెత్తను సేకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

తీరం శుభ్రత అందరి బాధ్యత



బీచ్ క్లీనింగ్ చేపట్టిన ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్, డిఫెన్స్ అకాడమీ బృందాలు

కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని కలెక్టర్ హరేందిర ప్రసాద్ నగర ప్రజలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా శనివారం ఇండియన్ కోస్ట్‌గార్డ్, ఎకోలాస్టిక్ సంస్థలు సంయుక్తంగా ఆర్.కె. బీచ్ క్లీనింగ్ చేపట్టాయి. ముందుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ తీరప్రాంతం కాలుష్యంతో జలరాశులు మృత్యువాత పడుతున్నాయన్నారు. తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం తీరంలో పేరుకుపోయిన చెత్తను కలెక్టర్‌తో పాటు కోస్ట్‌గార్డ్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, వలంటీర్లు సేకరించారు. ఈ సందర్భంగా బీచ్‌లో ఏర్పాటు చేసిన సైకత శిల్పం అందరినీ ఆకట్టుకుంది.

వివాహితపై హత్యాయత్నం

ఎంవీపీకాలనీ: సీతంపేటకు చెందిన వివాహితపై ఆర్.శ్రీనివాసరావు అనే వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతంపేటకు చెందిన వివాహిత హెచ్‌బీ కాలనీలో వస్త్ర దుకాణం నిర్వహిస్తోంది. తనతో మాట్లాడాలని బాధిత మహిళను కొంతకాలంగా శ్రీనివాసరావు ఒత్తిడి తెస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఆమె వస్త్ర దుకాణం మూసి ఇంటికి వెళుతుండగా వెంటపడ్డాడు. హెచ్‌బీ కాలనీ దరి స్టీల్‌పాంట్ క్వార్టర్స్ వద్ద ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. చాకుతో వెనుక నుంచి పొడవడంతో కేకలు వేసుకుంటూ బాధిత మహిళ పరుగులు తీయడంతో శ్రీనివాసరావు పరారయ్యాడు. వెంటనే స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం వెంకోజీపాలెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో బాధితురాలి నుంచి స్టేట్‌మెంట్ తీసుకుని శ్రీనివాసరావుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి శనివారం అరెస్టు చేశారు.

27 నుంచి టీటీ ర్యాంకింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: ఏపీ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. గీతం డీమ్డ్ వర్సిటీలో జరగనున్న ఈ పోటీలకు సంబంధించి పోస్టర్‌ను విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీటీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'హైలెవెల్' దగా..!



- ఫార్మా సెజ్ ప్రమాదాలపై 12 మంది బృందంతో కమిటీ
- సేఫ్టీ ప్రొటోకాల్స్‌పై అవగాహనలేని వారితో ఏర్పాటు
- కమిటీలో ఐఐటీ చెన్నై, ఐఐటీ తిరుపతి, నీతి ఆయోగ్ ప్రతినిధులు
- ఐదుగురు ఫార్మా పరిశ్రమల ప్రతినిధుల్నీ చేర్చిన సర్కారు
- ఇలాంటి వారు ఎలా విచారణ చేస్తారంటూ విమర్శలు

సాక్షి, విశాఖపట్నం: పరిశ్రమల్లో భద్రత ప్రశ్నార్థకమైంది.. రియాక్టర్లు అణుబాంబుల్లా పేలుతున్నాయి. పైప్‌లైన్లు యమపాశాల్లా మారుతున్నాయి. విధులకు వెళ్లిన కార్మికులు క్షేమంగా ఇల్లు చేరడం కష్టంగా మారింది. రసాయన పరిశ్రమల్లో కనీస రక్షణ చర్యలు లేకపోవటం.. నైపుణ్యం గల కార్మికులను వినియోగించకపోవడం అధిక ప్రమాదాలకు కారణంగా చెప్పవచ్చు. అచ్యుతాపురం సెజ్‌లో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదం తర్వాత నిద్రమేల్కొన్నట్లు నటించిన ప్రభుత్వం.. తూతూ మంత్రంగా హైలెవల్ కమిటీని విచారణకు వేసి మొద్దు నిద్రలోకి జారుకుంది. కనీసం ఫార్మాకు సంబంధించిన నిపుణులు లేని ఈ కమిటీ ఎందుకంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా ఏ పరిశ్రమల్లో అయితే ప్రమాదాలు జరుగుతున్నాయో ఆ కంపెనీ ప్రతినిధులనే కమిటీలో భాగస్వాములను చేయడంతో చంద్రబాబు దగా బయటపడింది.

ఆగస్టు 21న అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో జరిగిన ఘోర ప్రమాదంలో 17 మంది మృత్యువొడికి చేరుకోగా.. 40 మంది క్షతగాత్రులయ్యారు. తక్షణ విచారణకు ఏడు ప్రభుత్వ విభాగాల అధికారులతో ప్రమాదానికి కారణాలను అన్వేషించింది. ఇకపై ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు సంభవించకుండా పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు నిపుణులతో కూడిన హైలెవల్ కమిటీని ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రకటించిన నెల రోజుల తర్వాత కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నిపుణులెక్కడ చంద్రబాబూ..?

ప్రమాదం జరిగినప్పుడు కంటితుడుపు చర్యగా ఈ హైలెవల్ కమిటీని సీఎం చంద్రబాబు ఏర్పాటు చేసినట్లు స్పష్టమవుతోంది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వసుధా మిశ్రా చైర్‌పర్సన్‌గా ఏర్పాటు చేసిన కమిటీలో పర్యావరణం, అటవీశాఖ స్పెషల్ సీఎస్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు పరిశ్రమల శాఖ, వీసెజ్, ఫైర్, పరిశ్రమలు, ఏపీఐఐసీ తదితర విభాగాలకు చెందిన ఉన్నతాధికారులను సభ్యులుగా నియమించారు. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌ని కన్వీనర్‌గా నియమించారు. అయితే ఫార్మాకు సంబంధించిన అంశాలు, కెమికల్ రియాక్షన్‌కు సంబంధించిన వివరాలపై క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఏ ఒక్క నిపుణుడూ లేకపోవడం గమనార్హం. ఒక ప్రిన్సిపల్ సైంటిస్ట్‌ని గానీ, ఫార్మా ప్రొఫెసర్‌ను కానీ ఈ కమిటీలో నియమించలేదు. దీనివల్ల ఫార్మా సెజ్‌లలో ఉన్న రసాయనిక లోటుపాట్లపై ఎలా విచారణ చేపడతారన్నది ప్రశ్నార్థకంగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. నిపుణులు లేకుండా కమిటీ ఎందుకు వేశారో అర్థం కావడం లేదంటున్నారు.

విచారణకు వారే అయితే ఎలా..?

ఏర్పాటు చేసిన ఈ హైలెవల్ కమిటీలో మరో 8 మందిని పరిశ్రమల నిపుణులుగా నియమించారు. అయితే ఈ 8 మంది కూడా ఏవైతే ప్రమాదాలకు కారణమని చెబుతున్న పరిశ్రమలకు సంబంధించిన ప్రతినిధులనే ఇందులో చేర్చడం విడ్డూరంగా ఉంది. తమ ఫ్యాక్టరీల్లో ఉన్న లోటుపాట్లనను విచారణ కమిటీ సభ్యులుగా ఉన్న ప్రతినిధులు ఎలా బహిర్గతం చేస్తారన్నది ప్రశ్నార్థకమే. ఇండస్ట్రీ మెంబర్లు, నిపుణులుగా శ్రీ సిటీ ప్రతినిధి, పరవాడ ఫార్మా సిటీ, బల్క్ డ్రగ్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్(బీడీఎంఏ), అచ్యుతాపురం సెజ్, ఐఐటీ చెన్నై, ఐఐటీ తిరుపతికి చెందిన ఇండస్ట్రీ సేఫ్టీ ఎక్స్‌పర్ట్, నీతీ ఆయోగ్ నిపుణుడు.. ఇలాంటి వారిని నియమించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం తూతూ మంత్రంగా విచారణ జరిపించేందుకే తప్ప.. క్షేత్ర స్థాయిలో ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి ప్రమాదకర పరిశ్రమలపై చర్యలు తీసుకోవడం, భద్రతా ప్రమాణాలను పెంచాలన్న ఆలోచనలు ప్రభుత్వానికి లేనట్లు ఈ విచారణ కమిటీని చూస్తే స్పష్టమవుతోందంటూ ఆరోపిస్తున్నారు.

12 మందితో హై లెవల్ కమిటీ ఏర్పాటు

భవిష్యత్తులో ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరగకుండా ఏఏ చర్యలు తీసుకోవాలి..? ప్రస్తుతం ఉన్న కంపెనీలు భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నాయా లేదా..? కెమికల్ రియాక్షన్లు జరగకుండా ఉండేందుకు ఏఏ చర్యలు తీసుకుంటున్నారు..? సిబ్బంది, కార్మికుల్లో నైపుణ్యం ఏమేరకు ఉంది..? నిబంధనలకు అనుగుణంగా పరిశ్రమలు నడుస్తున్నాయా లేదా..? మొదలైన అంశాలపై విచారణ చేపట్టడంతో పాటు పారిశ్రామిక భద్రతా అంశాలు పెంచేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశాలపై రికమండేషన్లు ఇవ్వాలని కమిటీకి దిశానిర్దేశం చేశారు. మొత్తం 12 మంది సభ్యులతో పాటు ఇండస్ట్రీ మెంబర్స్ అండ్ ఎక్స్‌పర్ట్స్ పేరుతో మరో 8 మందిని కూడా చేర్చారు.

సేఫ్టీ ప్రొటోకాల్స్‌పై అనుభవం ఉన్న వారేరీ..?

ఫార్మా ప్రమాదాలపై ప్రభుత్వం నియమించిన హైలెవల్ కమిటీని చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది. ఐఐటీ, నీతి ఆయోగ్ ప్రతినిధులున్నారు కానీ.. వారెవ్వరికీ సేఫ్టీ ప్రొటోకాల్స్‌పై అనుభవం లేదు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే.. ఏ పరిశ్రమల్లో ప్రమాదాలు నిరంతరం జరుగుతున్నాయో, ఆ పరిశ్రమల ప్రతినిధులను మెంబర్లుగా చేర్చడం. అలాంటివారు మెంబర్లుగా ఉన్న కమిటీ ఇచ్చిన సలహాల మీద ప్రజలకు గాని, ప్రభుత్వానికి గాని నమ్మకం ఎలా కలుగుతుందో అర్థం కావడం లేదు. ప్రమాదాలు జరిగినప్పుడు యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లనే తరచూ సంభవిస్తున్నాయి. ప్రభుత్వం హైలెవెల్ కమిటీ పేరుతో విడుదల చేసిన జీవో నం.51ను తక్షణమే సవరణ చేసి పరిశ్రమల ప్రతినిధులకు బదులుగా నిపుణులను నియమించాలి. ఈ విషయంపై సీఎం చంద్రబాబుకు కూడా లేఖ రాశా.

–ఈఏఎస్ శర్మ, విశ్రాంత ఐఏఎస్ అధికారి

వచ్చే నెలాఖరులో రెండో బ్లాస్ట్‌ఫర్నేస్ ప్రారంభం

ఉక్కునగరం: అక్టోబర్ నెలాఖరులో రెండో బ్లాస్ట్‌ఫర్నేస్ ప్రారంభం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీ అరుణ్ కాంతి బాగ్చీ తెలిపారు. శనివారం అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో సీఎండీ ఈ మేరకు తెలిపినట్టు కార్మిక నాయకులు పేర్కొన్నారు. ఈనెలాఖరులో ఒక ఫర్నేస్‌లో 7 వేల టన్నులు ఉత్పత్తికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈనెల 18న కేంద్రం నుంచి రూ.500 కోట్లు వచ్చిందని అందులో జీఎస్టీ చెల్లించడంతో పాటు ముడి సరుకుల కోసం వినియోగించినట్టు పేర్కొన్నారు. రెండు ఫర్నేస్‌లలో అధిక ఉత్పత్తి చేయడానికి చర్యలు తీసుకుటామన్నారు. కేంద్రం నుంచి మరింత సాయం అందే అవకాశాలు ఉన్నాయని.. గత 10 రోజులుగా న్యూఢిల్లీ కేంద్రంగా జరిగిన సమాచారాన్ని కార్మిక నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు వీఆర్ఎస్, డిప్యుటేషన్‌లను వ్యతిరేకించారు. జీతాలు, పీఎఫ్, ఎస్‌బీఎఫ్, థ్రిఫ్ట్ సొసైటీల చెల్లింపులపై సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉక్కు యాజమాన్యం ప్రతినిధులతో పాటు నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్య రామ్, యు.రామస్వామి, రామ్మోహన్‌కుమార్, వి.శ్రీనివాస్, రామ్‌కుమార్, బి.డేవిడ్, కె.శ్రీనివాసనాయుడు, సురేష్‌బాబు, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ, డైరెక్టర్లు, ఉన్నతాధికారులు



అప్పన్న దేవస్థానం సెంట్రల్ స్టోర్స్‌లో తనిఖీలు

ప్రసాదాల తయారీకి వాడే నెయ్యి, ముడి సరుకుల నాణ్యత పరిశీలన

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ప్రసాదాల తయారీకి వాడుతున్న నెయ్యితో పాటు ఇతర ముడిసరుకుల నాణ్యతపై శనివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆహార భద్రత అధికారులతో కలిసి తనిఖీ చేశారు. అన్నప్రసాద భవనంలోని సెంట్రల్ స్టోర్స్‌లో ఉండే ముడి సరుకులను, అదే భవనంలోని పైఅంతస్తులోని వంటశాలలో లడ్డూ, పులిహోరా తయారీని పరిశీలించారు. లడ్డూ ప్రసాదం రుచి చూసి నెయ్యి వాసన రావడం లేదని విమర్శించారు. గడిచిన ఐదేళ్లలో దేవస్థానం కొనుగోలు చేసిన సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రూ.385.41 లకు కిలో నెయ్యి కొనుగోలు చేస్తుండటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. టెండర్ ప్రక్రియ ద్వారా నెయ్యి కొనుగోలు చేస్తున్నామని.. నాణ్యతకు సంబంధించి ఎప్పటికప్పుడు పరిశీలన ఉంటుందని దేవస్థానం అధికారులు సర్టిఫికెట్లు చూపించారు. ఆ సర్టిఫికెట్లను తోసిపుచ్చి అవి ఎలా వస్తాయో ఎవరికి తెలియవంటూ మాట దాట వేశారు. నెయ్యితో పాటు అన్ని సరుకుల శాంపిల్స్‌ను పరీక్షించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆహార భద్రత తనిఖీ అధికారులు శాంపిల్స్ తీసుకెళ్లారు.



లడ్డూ ప్రసాదం రుచి చూస్తున్న ఎమ్మెల్యే గంటా

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు విశాఖ విద్యార్థులు

మురళీనగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు విశాఖ జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని అండర్–14 బాలబాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహణ కార్యదర్శి వి.దేముడు తెలిపారు. తిరుపతిలో ఈనెల 22, 23 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారు. ఈ మేరకు విద్యార్థులు కోచ్‌లు ఎల్.అప్పలరాము, ఎస్‌కే బీబీ, ఎస్‌జీఎఫ్ నిర్వహణ కార్యదర్శి వి.దేముడు ఆధ్వర్యంలో విశాఖ నుంచి శనివారం బయలుదేరి వెళ్లారు.

కదిలిన రెవెన్యూ సిబ్బంది



సంగివలస చెరువు గట్టుపై నిర్మిస్తున్న ఇంటికి హెచ్చరిక బోర్డు పెట్టిన రెవెన్యూ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంగివలస కాలనీలో చెరువు గట్టుపై చేపడుతున్న నిర్మాణంపై ఆరుమాసాల ఆలస్యంగా భీమిలి రెవెన్యూ సిబ్బంది స్పందించారు. ఇక్కడి చెరువుగట్టుపై నిర్మాణంపై శనివారం 'దర్జాగా కబ్జా' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు రెవెన్యూ సిబ్బంది స్పందించారు. నిర్మాణాలు జరిగిన చోట హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

ఇసుక ధర రెట్టింపుతో ఉపాధి దూరం

మధురవాడలో భవన నిర్మాణ కార్మికుల రాస్తారోకో



మధురవాడ మార్కెట్ వద్ద రాస్తారోకో చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

మధురవాడ: ఇసుక అందుబాటులో లేకపోవడంతో పాటు రెట్టింపు ధరలకు అమ్మడం వలన నిర్మాణ రంగం మందగించిందని, భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్మిక సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం మధురవాడ మార్కెట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులు, బ్యానర్లతో రాస్తారోకో చేపట్టారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు పి. రాజ్‌కుమార్, డి. అప్పలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తానని హామీ ఇచ్చి రెట్టింపు ధరలకు అమ్మకాలు జరుపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలలుగా ఇబ్బందులు పడుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. కార్మిక కుటుంబాలు ఉపాధి లేక అవస్థలు పడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎం. అప్పన్న, ఏ.లక్ష్మణ, డి.రవి, కె.రమణ, టి.రామకృష్ణ, ఎస్.భాస్కరరావు, బి.రమణ, అనంతరావు, పాపారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'వినాయకుడి' ఊరేగింపులో అర్ధనగ్న ప్రదర్శనలు

- సబ్బవరం మండలం తవ్వవానిపాలెంలో జనసేన నాయకుల బరితెగింపు
- గ్రామ వీధుల్లో ట్రాక్టర్లు, నేల డ్యాన్సులతో ఇష్టారాజ్యం
- అనధికారికంగా అనుమతి ఇచ్చిన పోలీసులు!

సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో గణపతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఊరేగింపులో జనసేన నాయకులు బరితెగించారు. పవిత్ర వినాయక చవితి ఉత్సవాల్లో అర్ధనగ్న ప్రదర్శనలతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇంత జరుగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో వారే ఈ అర్ధనగ్న ప్రదర్శనలకు 'అనధికారిక' అనుమతులు ఇచ్చినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలివీ.. మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో జనసేన నాయకులు బోకం శ్రీనివాసరావు, బోకం స్వామినాయుడు(సర్పంచ్) ఆధ్వర్యంలో శనివారం వినాయక చవితి ఉత్సవాలు జరిగాయి. సాయంత్రం ఊరేగింపు సందర్భంగా గ్రామంలో ట్రాక్టర్లు, నేల రికార్డింగ్ డ్యాన్స్‌లు ఏర్పాటు చేశారు. సాయంత్రం 7 నుంచి రాత్రి పొద్దుపోయే వరకు అమ్మాయిలతో జనసేన నాయకులు అర్ధనగ్న ప్రదర్శనలు చేయించారు. అయితే వినాయక చవితి ఉత్సవాల్లో గస్తీ తిరిగే పోలీసులు కనీసం పట్టించుకోలేదు కదా ఓ రకంగా సహకరించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై సబ్బవరం సీఐ పి.రమణను వివరణ కోరగా అశ్లీల నృత్యాలు పూర్తిగా నిషేధమని, తవ్వవానిపాలెంలో రికార్డింగ్ డ్యాన్స్‌లు జరిగినట్లు తమ దృష్టికి రాలేదని, వస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తవ్వవానిపాలెంలో అర్ధనగ్న ప్రదర్శనలు



ఆకర్షిస్తున్న ఆకృతులు





బీచ్‌రోడ్డు: ఏయూ మెరైన్ గ్రౌండ్‌లో జరుగుతున్న దివ్యకళా మేళాలో ప్రదర్శించిన ఆకృతులు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. రాకెట్, చెట్టు కొమ్మపై ఆడుతున్న చిన్నారులు, రాజముద్ర, పుస్తకంలో గుర్రం వంటి వినూత్న ఆకృతులు అబ్బురపరుస్తున్నాయి. కొన్ని ఆకృతులు చారిత్రక సంఘటనలను, మరికొన్ని ఆకృతులు ప్రకృతిని, మరికొన్ని మానవ జీవితాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ ఆకృతుల వద్ద సెల్ఫీలు తీసుకోవడానికి సందర్శకులు ఆసక్తి చూపుతున్నారు.